సాక్షి
పల్నాడు
ఆదివారం : 7 : జూలై : 2024



ఆక్రమణల తొలగింపు

తెనాలిఅర్బన్: బుర్రిపాలెం రోడ్డులో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ శనివారం కొనసాగింది. పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు పరిశీలించారు.



సీడ్స్ కంపెనీ తనిఖీ

ఫిరంగిపురం: అమీనాబాద్ గ్రామపరిధిలోని తులసీ సీడ్స్ కంపెనీని శనివారం కోనసీమ వ్యవసాయ సహాయ సంచాలకుడు నాగేశ్వరరావు, విజిలెన్స్ సీఐ మాణిక్యరావు తనిఖీ చేశారు.

వేంకటేశ్వరునికి తులసీదళార్చన



అమరావతి: మండలపరిధిలోని మల్లాది గ్రామంలో వేంచేసియున్న వటవృక్షాంతర్గత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం తులసీదళార్చన, శాంతి కల్యాణం నిర్వహించారు.

న్యూస్‌రీల్

టీడీపీ దాడులకు నిరసనగా రేపు ధర్నా



నరసరావుపేట: ఎన్నికల అనంతరం అధికార తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకులు దళిత, పీడిత కులాల, మైనారిటీ ప్రజలపై జరుపుతున్న హింసా, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడుదామని కుల నిర్మూలన పోరాట సమితి(కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ పిలుపునిచ్చారు. ఎన్నికల అనంతరం అధికార తెలుగుదేశం పార్టీ కూటమి ప్రజలపై చేస్తున్న చట్ట వ్యతిరేక దాడులను ఖండిస్తూ కేఎన్‌పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 8న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు సంబంధించిన కరపత్రాలు స్థానిక ఎన్‌జీఓ హోంలో శనివారం ఆవిష్కరించారు. టీడీపీ వారి దాడిలో గాయాలపాలై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కామినేని రామారావును పరామర్శించారు. జిల్లా సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య, కంభాల ఏడుకొండలు, శిఖినం సాంబయ్య (ప్రగతిశీల కార్మిక సమాఖ్య, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జి.రామకృష్ణ, షేక్ మస్తాన్ వలి, సీఐటీయూ నాయకులు సిలార్, మాలిక్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దహనం



వినుకొండ(నూజెండ్ల): ఇంటి బయట ఉన్న ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేసిన సంఘటన నూజెండ్ల గ్రామంలో శనివారం జరిగింది. బాధితుడు అడపాల మణికంఠ తెలిపిన వివరాల ప్రకారం... మధ్యాహ్నం 2గంటల సమయంలో మణికంఠ ఇంట్లో ఉండగా బయట ఉన్న ద్విచక్రవాహనం తగలబడుతుండటంతో వెంటనే స్పందించి నీళ్లు పోసి మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మణికంఠ తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న సంఘటనల నేపథ్యంలో టీడీపీ వర్గీయులే ఈ వాహనాన్ని దహనం చేసి ఉండవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

193 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



క్రోసూరు: మండలంలోని నాగవరం గ్రామం వద్ద శనివారం తెల్లవారుజామున 193 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఎం.షఫీ తెలిపిన వివరాలు...అచ్చంపేట మండలం చిగురుపాడు గ్రామానికి చెందిన పోలిశెట్టి చెంచయ్య వద్ద ఉన్న రేషన్ బియ్యంను నకరికల్లు గ్రామానికి చెందిన వెంగళరావుకు లారీలో తరలిస్తున్నారు. ముందస్తు అందిన సమాచారం మేరకు పోలీసులు నాగవరం గ్రామం వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. లారీలో 9930 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్లు చెప్పారు. లారీ స్వాధీనం చేసుకుని డ్రైవర్, క్లీనర్, విక్రయదారుడు, కొనుగోలుదారులపై కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యం సివిల్ సప్లయిస్ డీటీ షేక్ గఫూర్‌కు అప్పగించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మాచర్ల రూరల్: నర్సరీలో మొక్కలకు నీరు పెడుతూ ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... గ్రామానికి చెందిన తేళ్లూరి సత్యనారాయణరెడ్డి (40) లక్ష్మీ శ్రీనివాస నర్సరీలో మొక్కలకు నీరు పెట్టేందుకు విద్యుత్ మోటార్ స్విచ్ వేసేందుకు మోటార్ దగ్గరకు వెళ్లి ఆన్ చేశాడు. విద్యుత్ ప్రవహిస్తున్న వైర్లు తగిలి తీవ్రమైన షాక్ తగలటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి భార్య, పిల్లలున్నారు. ఈ మేరకు విజయపురి సౌత్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 503.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 814.30 అడుగుల వద్ద ఉంది.

ఇంకెన్నాళ్లకు అంతర్జాతీయం

నత్తనడకన క్రికెట్ స్టేడియం నిర్మాణం



మధ్యంతరంగా పనులు నిలిచిపోయిన ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

- పూర్తయితే విశాఖ కంటే పెద్ద స్టేడియంగా మంగళగిరి స్టేడియంకు గుర్తింపు
- నిధులు విడుదలలో బీసీసీఐ నిర్లక్ష్యం
- పదేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణం
- ఇప్పటికి 60 శాతం మాత్రమే పూర్తి
- అడపాదడపా అంతర్ జిల్లాల స్థాయి మ్యాచ్‌ల నిర్వహణ
- అంతర్జాతీయ మ్యాచ్‌లు జరిగితేనే గుర్తింపు
- నిరాశలో క్రికెట్ అభిమానులు

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణం ఆలస్యం అవుతుండడం క్రికెట్ అభిమానులను నిరాశకు గురిచేస్తుంది. కార్పొరేషన్‌కు మణిహారం లాంటి ఏసీఏ అంతర్జాతీయ స్టేడియంలో గత పదేళ్లుగా నత్తనడకన పనులు కొనసాగుతుండడం క్రీడా అభిమానులతో పాటు స్థానికులను సైతం నిరాశకు గురిచేస్తోంది.

2014లో నిర్మాణం ప్రారంభం..

మంగళగిరి పట్టణాన్ని ఆనుకుని అమరావతి టౌన్‌షిప్‌లో నిర్మాణం జరుపుకుంటున్న అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం 2021 సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేసుకుని అదే ఏడాదిలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ నిర్వహించడం జరుగుతుందని ఏసీఏ ప్రకటించినా ఆచరణకు నోచుకోలేదు. 2008 సంవత్సరంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మంగళగిరి పట్టణాన్ని ఆనుకుని నవులూరు, నిడమర్రు, బేతపూడి గ్రామాల మధ్య ఉడా టౌన్‌షిప్ ఏర్పాటు చేశారు. టౌన్‌షిప్‌లో 23 ఎకరాల భూమిని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కొనుగోలు చేసింది. ఏసీఏ ఆధ్వర్యంలో 2014 సంవత్సరంలో క్రికెట్ స్టేడియం నిర్మాణం ప్రారంభించి పరిపాలనా భవనం, ఇండోర్ స్టేడియం పూర్తి చేసుకుని క్రికెట్ క్రీడాకారులకు శిక్షణ ప్రారంభించారు.

36వేల సీటింగ్ కెపాసిటీ..

మైదానంలో ఆరు పిచ్‌లలో మ్యాచ్‌లు నిర్వహించగా పిచ్‌లు అద్భుతంగా ఉన్నాయని, అంతర్జాతీయ మ్యాచ్‌లకు మైదానం ఎంతో అనువుగా ఉందని క్రికెటర్లతో పాటు నిర్వాహకులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే విశాఖపట్నంలో ఉన్న మైదానం 28వేల మంది ప్రేక్షకులు మాత్రమే పట్టే అవకాశం ఉండగా మంగళగిరి స్టేడియంలో 36 వేల మంది కూర్చొనే అవకాశం ఉంది. స్టేడియంకు మంగళగిరి నుంచి వెళ్లేందుకు నిడమర్రు రైల్వేగేటు అడ్డుగా ఉండడంతో రైల్వే వంతెన నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదనలను రైల్వేబోర్డుకు పంపగా వంతెన నిర్మాణానికి రైల్వేబోర్డు అంగీకారం తెలిపింది. స్టేడియంలోని మైదానంలో వినియోగించే గడ్డి(బర్మడా గ్రాస్)ని గోదావరి జిల్లాలో పండించి తెచ్చి ఏర్పాటు చేశారు. స్టేడియం పూర్తి అయి, అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణ ప్రారంభమైతే దక్షిణ భారతదేశంలో ఒక అద్భుతమైన స్టేడియంగా అవతరిస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. మహిళల, పురుషులు అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు జరుగుతున్నా పూర్తిస్థాయిలో అంతర్జాతీయ మ్యాచ్ జరిగితేనే స్టేడియంకు గుర్తింపు వస్తుందని క్రీడాభిమానులు ఆశిస్తున్నారు.

నిధులు విడుదలలో జాప్యం..

రూ.120 కోట్ల అంచనాలతో ప్రారంభమైన క్రికెట్ స్టేడియంలో గ్యాలరీల నిర్మాణం, పిచ్ ఏర్పాటు సైతం పూర్తి కావచ్చింది. రూ.70 కోట్ల నిధులను ఖర్చు చేసిన ఏసీఏ 60 శాతానికిపైగా పనులు పూర్తి చేసింది. మరో రూ.50 కోట్లు ఏసీఏ నుంచి రావాల్సి ఉందని నిర్వాహకులు తెలిపారు. వాస్తవానికి 2019 నాటికే స్టేడియం పనులు పూర్తి కావాల్సి ఉంది. బీసీసీఐ నుంచి నిధులు విడుదల ఆగిపోవడంతో నాలుగు సంవత్సరాలుగా పనులు నిలిచిపోయాయి. ఎట్టకేలకు మళ్లీ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు రూ.10 కోట్లు విడుదల అయ్యాయి.

అందుబాటులో 2.39 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక



కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి తెలిపిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలోని ఆరు ఇసుక రీచ్‌లలో 2,39,900.49 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, 5 డీ- సిల్టింగ్ పాయింట్లు ఉన్నాయని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ చెప్పారు. ఈ నెల ఎనిమిదో తేదీ సోమవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెడుతున్న ఉచిత ఇసుక విధానం అమలుకు చేసుకోవాల్సిన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం నిర్వహించిన వీడియా కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బి.లత్కర్ పాల్గొన్నారు. రానున్న మూడు నెలల కాలంలో ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా, ప్రశాంతంగా అవసరమైన వారికి అందించేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్లు, గనులు, భూగర్భ శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈనెల ఒకటిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందున ఆయన జిల్లా కలెక్టర్లను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌లలో మండల రెవెన్యూ అధికారులచే పంచనామా నిర్వహించి లిఖిత పూర్వకంగా ఇసుక నిల్వలు తీసుకోవడం జరుగుతుందని, ఆయా ఇసుక రీచ్‌లలో ఇన్‌చార్జిలను నియమిస్తామని తెలిపారు. అడిషనల్ ఎస్పీ రాఘవేంద్ర, డీఆర్వో కె.వినాయకం, గనులు, భూగర్భ శాఖాధికారి నాగిని పాల్గొన్నారు.

రోజుకు ఒకరికి 20 టన్నుల ఇసుకే..

జిల్లాలో సోమవారం నుంచి రోజుకు ఒకరికి 20టన్నుల ఇసుక మాత్రమే పొందే అవకాశం ఉందని జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి నాగిని పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఫ్రీ ఇసుక పాలసీపై డిస్ట్రిక్ సాండ్ కమిటీ నిర్వహించిన సమీక్షకు హాజరయ్యారు. ఇసుక పొందే వివరాలను తెలిపారు. జిల్లాలో ఆరు ప్రాంతాలైన అమరావతి మండలంలోని వైకుంఠపురంలో 64,567 మెట్రిక్ టన్నులు, అచ్చంపేట మండలం కోనూరులో 49,171, కొత్తపల్లిలో 24,393, మాదిపాడులో 75,878, వినుకొండలో 15,402, రాజుపాలెం మండలం కొండమోడులో 10,588 మెట్రిక్ టన్నులతో మొత్తం 2,39,900 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు.

ఛార్జీలు ఇలా...

ఇసుక నది నుంచి తీసినందుకు టన్నుకు రూ.30, లోడింగ్ చార్జీలు రూ.30, అడ్మిన్ చార్జీలు రూ.20, సీనరేజ్ ఫీజు రూ.88 వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. రవాణాకు ప్రతి టన్నుకు కిలోమీటరుకు రూ.4.90 చార్జీలు ఉంటాయన్నారు. వీటన్నింటిపై జీఎస్‌టీ 18శాతాన్ని జిల్లా కమిటీ నిర్ణయించిందన్నారు. రవాణా చార్జీలే కాకుండా డిపో నుంచి ఒక టన్నుకు రూ.192 డిజిటల్ పేమెంట్ ద్వారా స్టాక్ యార్డు నుంచి నేరుగా పొందవచ్చన్నారు. వైకుంఠపురం, కోనూరు, మాదిపాడు ఇసుక రీచ్‌లలో రూ.191.52 చొప్పున, వినుకొండ, కొండమోడు రీచ్‌ల నుంచి రవాణా చార్జీలు కలుపుకొని టన్నుకు రూ.792.45, రూ.565.22 చెల్లించాలన్నారు. వీటితోపాటు మరో ఐదు డిసిల్టేషన్ పాయింట్స్ వైకుంఠపురంలో రెండు, ధరణికోట, దిడుగు, చామర్రు, మాదిపాడులలో 5,38,500 మెట్రిక్ టన్నుల ఇసుక పరిమాణం ఉందన్నారు. పొల్యూషన్ శాఖ అనుమతులు వచ్చిన వెంటనే మరో రూ.200 అదనంగా చెల్లించి ఇసుక పొందవచ్చన్నారు. ఇసుక లభ్యతపై ఏఎంఐపీఎస్ పోర్టల్ సోమవారం నుంచి ప్రజలకు అందుబాటు లో ఉంటుందన్నారు. ఇసుక అక్రమంగా నిల్వచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుకపై ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ 1800–425–6029, మెయిల్ dmgopanadurandcompaintr @myyahoo.comకు పంపించవచ్చన్నారు.

సహకార సంఘాల ద్వారా నిర్మాణాత్మక అభివృద్ధి

సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ రామ్మోహన్



సహకార పతాకానికి గౌరవ వందనం సమర్పిస్తున్న సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: సహకార సంఘాల ద్వారా సామాజిక సత్వర అభివృద్ధి సాధ్యపడుతుందని విజయవాడ కోఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ ఎం.రామ్మోహన్ అన్నారు. ప్రకాష్‌నగర్‌లోని కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆవరణలో శనివారం 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన సహకార పతాకాన్ని రామ్మోహన్ ఆవిష్కరించి సహకార ప్రతిజ్ఞ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సహకార దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని 54 అంశాలలో సహకార సంఘాల ద్వారా ఆర్థిక సుస్థిరత, నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ, పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల అభివృద్ధి తదితర అంశాలలో లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని వివరించారు. డివిజనల్ కోఆపరేటివ్ అధికారి యు.నాగశ్రీనివాస్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో సహకార సంఘాల అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఉందన్నారు. జిల్లాలో మల్టీపర్పస్ గోడౌన్లను సకాలంలో పూర్తిచేసి అందించామన్నారు. అలాగే పాల సహకార సంఘాల ద్వారా రూ.83కోట్ల వ్యాపారం నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి డి.శ్రీనివాస్, ట్రెనింగ్ సెంటర్ మేనేజర్ నాగేశ్వరరావు, సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి స్వర్ణ చినరామిరెడ్డి, జీడీసీసీ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే లైసెన్సు రద్దు

వ్యవసాయ కమిషనరేట్ తనిఖీ అధికారి వెంకటేశ్వరరావు



అచ్చంపేటలో ఎరువులు, విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు

అచ్చంపేట: కృత్రిమ కొరత సృష్టించి విత్తనాలు, ఎరువులను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని వ్యవసాయ కమిషనరేట్ తనిఖీ అధికారి బి.వెంకటేశ్వరరావు, విజిలెన్స్ ఎస్‌ఐ రవికుమార్ వ్యాపారులను, డీలర్లను హెచ్చరించారు. అచ్చంపేటలోని ఎరువులు, విత్తన దుకాణాలను శనివారం సాయంత్రం విజిలెన్స్, వ్యవసాయ శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్, శ్రీ తిరుమల ట్రేడర్స్‌లో అనుమతి పత్రాలు లేని రూ.68,400 విలువచేస్తే ఎరువుల అమ్మకాలను నిలుపుదలచేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఎరువుల నాణ్యత నిమిత్తం శాంపిల్స్ సేకరించి ప్రయోగశాలకు పంపించాలని ఏఓ వెంకటేశ్వర్లును ఆదేశించారు. స్టాక్ బోర్డులను, స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు విక్రయించగానే బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, వాటిని పంట కాలం పూర్తయ్యేంతవరకు దాచుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వ్యాపారాలు పారదర్శకంగా ఉండాలే తప్ప అధిక ధరలకు విక్రయించడం నేరమన్నారు.

అగ్నివీర్ వాయుసేనలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న భారత వైమానిక దళం నాన్ కమిషన్‌డ్ ఆఫీసర్ ఎన్.సందీప్

బాపట్ల: అగ్నివీర్ వాయుసేనలో చేరడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భారత వైమానిక దళం నాన్ కమిషన్‌డ్ ఆఫీసర్ ఎన్.సందీప్ తెలిపారు. అగ్నివీర్ వాయుసేనపై అనుబంధ శాఖల అధికారులతో శనివారం బాపట్ల కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. భారత సైన్యంలోకి యువకులు చేరడానికి అగ్నివీర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని చెప్పారు. ఈనెల 8 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3వ తేదీ మధ్యలో జన్మించిన వారే అర్హులని పేర్కొన్నారు. అక్టోబర్ 18వ తేదీన రాత పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో పొందవచ్చని సూచించారు. బాపట్ల జిల్లాలోని 149 కళాశాలల్లో యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. నాలుగేళ్ల పాటు సైన్యంలో పనిచేయడం ద్వారా కలిగే ప్రయోజనాల్ని యువతకు వివరించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆర్‌ఐఓ ఎర్రయ్య పాల్గొన్నారు.

స్నేహం ముసుగులో డబ్బు కోసం హత్య

- సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి అరెస్టు
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన సీఐ నరసింహారావు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరసింహారావు

సంతమాగులూరు (అద్దంకి): స్నేహం ముసుగులో ఓ వ్యక్తిని డబ్బు కోసం హత్య చేశాడు ఓ దుర్మార్గుడు. శనివారం సీఐ నరసింహారావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుడి వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గంగలకుంట (ప్రస్తుత నివాసం శిరిగిరిపాడు) గ్రామానికి చెందిన మేడబోయిన ఆంజనేయులు (32) గొర్రెల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇదే జిల్లా నూజెండ్ల మండలం పాతరెడ్డిపాలెం గ్రామానికి చెందిన నిందితుడు రావుపల్లి నాగప్రసాద్‌తో ఆంజనేయులుకు పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి వినుకొండ, చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లోని సంతలకు వెళ్లి గొర్రెలను కొనుగోలు చేసి మళ్లీ లాభాలకు విక్రయిస్తుంటారు. దాంతో ఇద్దరూ మంచి స్నేహితులుగా మారారు. అయితే నిందితుడు నాగప్రసాద్ చెడు వ్యసనాలకు బానిస కావడంతో గొర్రెలు అమ్మగా వచ్చిన డబ్బును మంచినీళ్ల వలే ఖర్చు చేసి తన వ్యసనాల కోసం అప్పులు చేశాడు. ఎలాగైనా తన స్నేహితుని వద్ద ఉన్న డబ్బు కాజేయాలనే ఉద్దేశంతో ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం మార్చి 7వ తేదీన ఆంజనేయులుకు ఫోన్ చేసి, మనం గొర్రెల వ్యాపారం మరింత ఎక్కువగా చేయడం వల్ల మరింత లాభం వస్తుందని నమ్మబలికాడు. రూ.3 లక్షలు తీసుకుని రావాలని చెప్పాడు. దాంతో తాను డబ్బు తీసుకుని వస్తున్నానని నిందితుడితో ఆంజనేయులు ఫోన్‌లో చెప్పాడు.

సున్నిత అవయవాలపై దాడి చేసి..

వెంటనే నిందితుడు నాగప్రసాద్ తన మోటారు బైకు తీసుకుని పుట్టావారిపాలెం వెళ్లి మృతుడిని తన బైకుపై ఎక్కించుకని సంతమాగులూరు వెళ్లారు. అక్కడ నాగప్రసాద్ తన ప్లాన్ ప్రకారం ఆంజనేయులుకి మద్యం తాగించాడు. మళ్లీ మరోచోట మద్యం తాగించి ఆంజనేయులుని తన బైకుపై సంతమాగులూరు మండలంలోని గురిజేపల్లి గ్రామ కరివేపాకు తోట వద్దకు తీసుకుని వెళ్లి అక్కడ దించాడు. అప్పటికే పూటుగా తాగిన ఆంజనేయులు వెనక్కు పడిపోయాడు. వెంటనే నాగప్రసాద్ బీజాలు, పొట్టపై దాడి చేశాడు. మెడకు కట్టుకుని ఉన్న కాశీదారంను గట్టిగా మెలితిప్పడంతో మృతి చెందినట్లు నిర్ధారించుకున్నాడు. తరువాత మృతుడి వద్ద ఉన్న సంచిలోని రూ.2.85 లక్ష, సెల్‌ఫోన్‌ను తీసుకుని, సెల్‌ఫోన్‌లోని సిమ్ కార్డు తీసేసి స్విచ్ఛాఫ్ చేసి పరారీలో ఉన్నాడు. కరివేపాకు తోటలో గుర్తు తెలియని మృతదేహం ఉందనే సంతమాగులూరు వీఆర్‌వో షేక్ అబ్దుల్ సుభాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బంధువులు మృతదేహాన్ని గుర్తించి, నాగప్రసాద్‌పై అనుమానం వ్యక్తం చేయగా, ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని గుర్తించారు. బల్లికురవ మండలంలోని వేమవరం గ్రామం వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నాగప్రసాద్‌ను పట్టుకున్న సిబ్బందిని సీఐ అభినందించారు. నిందితుడి వద్ద నుంచి నగదును, సెల్‌ఫోన్, బైకును సీజ్ చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్సై సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాఢ సంబరం

- తొలి సారెను సమర్పించిన ఆలయ అర్చకులు
- భారీగా తరలివచ్చిన భక్త బృందాలు
- ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక సందడి
- ఆరంభమైన వారాహి నవరాత్రులు



అమ్మవారికి సారె తీసుకొస్తున్న ఆలయ అర్చకులు, వారి కుటుంబసభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో శనివారం నుంచి ఆషాఢ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ఆలయ అర్చకులు తొలి సారెను సమర్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు భక్తులు అమ్మవారికి సారెను సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో తొలిసారిగా వారాహి నవరాత్రులను ప్రారంభించారు. ఆలయంలోని అమ్మవారి వద్ద ఆలయ అర్చకులు పూజలు నిర్వహించడంతో ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి.

ఉత్సవమూర్తికి పూజలు....

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని దుర్గమ్మకు ఆలయ అర్చకులు, వేద పండితులు, ఇతర అర్చక సిబ్బందికి తొలి సారెను సమర్పించారు. తొలుత కనకదుర్గనగర్ నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రాల మధ్య ఆలయ అర్చకులు అమ్మవారికి పట్టుచీర, పూలు, పండ్లు, పూజా సామగ్రిని తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. రాజగోపురం వద్ద ఆలయ అర్చకులను ఈవో కెఎస్.రామరావు సాదరంగా స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకుని పట్టుచీర, పూజా సామగ్రిని అందించారు. అనంతరం మహామండపం ఆరో అంతస్తులోని ఉత్సవమూర్తిని ప్రతిష్టించి పూజలు చేశారు. ఆలయ ఈవో కెఎస్.రామరావు దంపతులు, స్థానాచర్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. దేవస్థాన అర్చక బృందం తరుపున శ్రీ గంగా, పార్వతి (దుర్గ)లకు బంగారు మంగళసూత్రాలు, గొలుసులను కానుకగా సమర్పించారు.

అమ్మవారి సేవలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ...

ఆషాఢ మాసోత్సవాల నేపథ్యంలో దుర్గమ్మను దేవదాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన సత్యనారాయణను ఆలయ ఈవో కెఎస్. రామరావు సాదరంగా స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు.

తొలి రోజున భారీగా భక్త బృందాలు...

ఆషాఢ మాసం తొలి రోజున భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. వీకెండ్ కావడంతో తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు బృందాలుగా ఏర్పడి ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకుని సారెను సమర్పించారు. తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి, భక్త బృందంతో కలిసి వచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు.

వైభవంగా వారాహి నవరాత్రులు....

దుర్గమ్మ సన్నిధిలో వారాహి నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి వద్ద కలశస్థాపన, జ్యోతి ప్రజ్వలన చేశారు.

క్లుప్తంగా

నూతన సాంకేతికతను విద్యార్థులకు అందించాలి

సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ బి.నవ్య



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య

పెదకాకాని: అధ్యాపకులు విద్యార్థులకు ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక విద్యా మరియు శిక్షణామండలి, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్, చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వారంరోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నందు జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ బి.నవ్య హాజరై మాట్లాడారు. అధ్యాపకులు మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. కొత్త ఆలోచనలను, కొత్త అవకాశాలను విద్యార్థులకు అధ్యాపకులు పరిచయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ మెకానికల్ విభాగం అధ్యాపకుల నుంచి సూచనలు స్వీకరించారు. ఎన్ఐటీటీటీఆర్, చెన్నై ప్రొఫెసర్ బాల సుబ్రమణ్యన్, వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్, సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భార్యను కడతేర్చిన భర్త



దుర్గి: భార్యాభర్తల మధ్య గొడవ ప్రాణాల మీదకు తీసుకొచ్చిన విషాద ఘటన మండలంలోని పోలేపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ ఖాదర్‌వలి, సిలార్ బీ (39) దంపతుల మధ్య శుక్రవారం రాత్రి చిన్నపాటి వివాదం జరిగింది. ఆవేశానికి లోనైన భర్త చేతిలోని కర్రతో సిలార్ బీ తలపై గట్టిగా కొట్టాడు. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త మాచర్ల పట్టణంలో ముఠా కూలీ పనిచేస్తున్నాడు. సిలార్ బీ వ్యవసాయ కూలీ పనులు చేస్తుండేది. వీరికి ముగ్గురు సంతానం, ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ సంతానం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు

మాచర్ల రూరల్: తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న స్నేహితుడిని గొడ్డలితో నరికి చంపిన సంఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు గురజాల డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. వెల్దుర్తి మండలం మిట్టమీదిపల్లె గ్రామంలో మృతుడు పులి వెంకటరెడ్డి అదే గ్రామానికి చెందిన జింకల పోలిరెడ్డిలు స్నేహితులు. పోలిరెడ్డి భార్య చనిపోవటంతో దాచేపల్లికి చెందిన ఓ మహిళను గ్రామానికి తీసుకొచ్చి సహజీవనం చేస్తున్నాడు. పోలిరెడ్డి భార్యతో వెంకటరెడ్డికి సాన్నిహిత్యం ఏర్పడింది. ఓ రోజు ఆమెతో వెంకటరెడ్డి కలసి ఉండడం చూసిన పోలిరెడ్డి గొడవపడ్డాడు. ఆ తరువాత పోలిరెడ్డి భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. వెంకటరెడ్డి, పోలిరెడ్డిలు కొన్ని రోజులు మాట్లాడుకోలేదు. ఈ నేపథ్యంలో పోలిరెడ్డి కిడ్నీ సంబంధిత వ్యాధితో వైద్యశాలలో చేరాడు. వైద్యానికి అవసరమైన రూ.3లక్షలను స్నేహితుడైన వెంకటరెడ్డికి ఇచ్చి ఖర్చు పెట్టమని చెప్పాడు. వెంకటరెడ్డి సరైన లెక్కలు చెప్పకపోవటంతో ఇరువురి మధ్య మళ్లీ విభేదాలు తలెత్తాయి. ఇవన్నీ మనసులో పెట్టుకున్న పోలిరెడ్డి స్నేహితుడైన వెంకటరెడ్డిని మద్యం తాగుదాం రమ్మని ఈ నెల 4వ తేదీన గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. అతని దగ్గర ఉన్న గొడ్డలితో వెంకటరెడ్డి మెడపై నరికి హత్య చేశాడు. అప్పటి నుంచి నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శిరిగిరిపాడు చెక్‌పోస్టు వద్ద మధ్యవర్తుల సమక్షంలో నిందితుడిని అరెస్టు చేసి గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన కొద్ది రోజులకే రూరల్ సీఐ కె సురేష్ నేతృత్వంలో నిందితుడిని పట్టుకున్న ఎస్ఐలు రాజశేఖర్, సత్యనారాయణ, పట్టాభిరామయ్య బృందాన్ని జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ ప్రత్యేకంగా అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

పిడుగురాళ్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా ఉంటారని పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ రవి తెలిపారు. పట్టణంలోని మారుతీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శనివారం హాజరయ్యారు. డయేరియాతో బాధపడుతున్న రోగులను పరామర్శించారు. అనంతరం వైద్యులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి మాట్లాడుతూ ప్రధానంగా నివసిస్తున్న ప్రాంతాలలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలన్నారు.

ముఖ్యంగా నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని, డ్రైనేజీ నీరు పారుదల అయ్యేలా చూడాలని సూచించారు. ప్రస్తుతం మారుతీనగర్, లెనిన్‌నగర్ ప్రాంతాల్లో డయేరియా బాధితులకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. డయేరియా సోకకుండా ఉండేందుకు ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డయేరియాతో ప్రభుత్వ ఉద్యోగి చికిత్స పొందుతూ మృతి చెందాడని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. ఈ ప్రాంతంలో డయేరియా ఉన్న వారికి వైద్య సేవలు అందిస్తున్నామని, మృతి చెందిన ఉపాధ్యాయునికి ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మారుతీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రవితేజ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డయేరియాతో ఉపాధ్యాయుడు మృతి



పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు దొప్పలపూడి దేవరత్నం(53) శనివారం మృతి చెందారు. రెండు రోజులగా వాంతులు, విరేచనాలతో ఆయన బాధపడుతున్నారు. పిడుగురాళ్ల పట్టణంలో వైద్య సేవలు పొందుతూ పరిస్థితి విషమంగా మారడంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మారుతీనగర్, లెనిన్‌నగర్ ప్రాంతాల్లో డయేరియాతో పలువురు బాధపడుతున్నారు. ఎస్టీయూ పల్నాడు జిల్లా సీనియర్ నాయకుడైన దేవరత్నం మృతి పట్ల ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం. సాయిశ్రీనివాస్, ఎం.రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్‌బాబు, పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్‌వీ రామిరెడ్డి, యూ.చంద్రజిత్ యాదవ్‌లు, రాష్ట్ర కౌన్సిలర్ స్వామి, సత్యనారాయణ, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు.

ఇసుక రీచ్‌లు పరిశీలన

తాడికొండ: ఉచిత ఇసుక విధానం అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో రీచ్‌ల వద్ద ఏర్పాట్లను పరిశీలించాలన్న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం తుళ్లూరు మండలంలో రెవెన్యూ, పోలీసు, సెబ్ అధికారులు రీచ్‌లను పరిశీలించారు. లింగాయపాలెం, తాళ్లాయపాలెం, రాయపూడి గ్రామాల్లోని రీచ్‌లను పరిశీలించిన అధికారులు ఉచిత ఇసుక విధానం కోసం డంపింగ్, లోడింగ్, స్టాక్ పాయింట్, సీసీ కెమెరాల ఏర్పాటు అంశాలను పరిశీలించి నివేదిక రూపొందించారు. నివేదికను జిల్లా అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు.

రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొన్న లారీ

- మృతుడి తల, మొండెం వేర్వే మృతి
- కొలనుకొండ – వడ్డేశ్వరం అండర్‌పాస్ వద్ద జాతీయ రహదారిపై ఘటన



తల, మొండెం వేరైన మృతదేహం

తాడేపల్లిరూరల్: 16వ నెంబర్ జాతీయ రహదారిపై కొలనుకొండ–వడ్డేశ్వరం అండర్‌పాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి శనివారం అక్కడికక్కడే మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం బ్రహ్మానందపురానికి చెందిన నెమలికంటి రాజు (53) ఉదయం 10 గంటల సమయంలో డీజీపీ కార్యాలయం వడ్డేశ్వరం–కొలనుకొండ అండర్‌పాస్ మధ్యలో జాతీయ రహదారి దాటుతుండగా చెన్నై నుంచి విజయవాడ వైపు అతివేగంగా వెళుతున్న ఓ లారీ నెమలికంటి రాజును ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజు ఎగిరి రోడ్డుపై పడడంతో అతని ఛాతీపైనుంచి లారీ టైర్లు వెళ్లడంతో తల మొండి విడిపోయాయి.

నెమలికంటి రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తల, మొండెం వేరు కావడంతో జాతీయ రహదారి రక్తసిక్తం అయ్యింది. ఆ రహదారిలో ప్రయాణించే వారు ఆ రక్తాన్ని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే రాజు చనిపోవడంతో డిగ్రీ చదువుతున్న రాజు కుమారుడైన పృథ్వీ తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పృథ్వీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నెమలికంటి రాజు కుమార్తెకు పది రోజుల క్రితం వివాహమైంది. శుభకార్యం జరిగిన ఇంట్లోనే విషాదం చోటుచేసుకోండంతో భార్య విజయలక్ష్మి అక్కడికక్కడే కుప్పకూలింది. జరిగిన సంఘటనపై ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ నోడల్ అధికారి నందిగం సురేష్



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందజేస్తున్న అధికారులు

శావల్యాపురం: పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ నోడల్ అధికారి నందిగం సురేష్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని శావల్యాపురం, వేల్పూరు గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 7,8,9 తరగతుల విద్యార్థులకు 'సిగిరెట్ వద్దు..పోషకాహారం ముద్దు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచి విద్యార్థుల్లో పొగాకు ఉత్పత్తులు సిగిరెట్ తాగటం, గుట్కా తదితర వాటిపై అవగాహన పెంపొందించటం ద్వారా భవిష్యత్‌లో చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. గుట్కా, ఖైనీ తినే వారందరు నోటి క్యాన్సర్ బారిన పడతాయన్నారు. పొగాకు ఉత్పత్తులపై విద్యార్థులు అవగాహన కల్గి ఉండడం ద్వారా తమ తల్లిదండ్రులు ఇలాంటి చెడు వ్యసనాలకు బారిన పడకుండా ఉంటారన్నారు. అనంతరం పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులు ప్రసన్న (9వ తరగతి), వెన్నల (8వ తరగతి) నాగ అఖిల్ (9వ తరగతి)లకు ప్రశంసాపత్రాలతోపాటు మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డుపాటి విజయలక్ష్మి, మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రావిపూడి రమ్య, ఆరోగ్య సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్త ఇంకొల్లు నాగలక్ష్మి, ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమం



పట్టణంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో నెల రోజులుగా జరుగుతున్న క్యాన్సర్ గుర్తింపు శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, ఆర్ఎంఓ శోభారాణి ఆధ్వర్యంలో ఎంఓస్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇచ్చారు. వైద్యాధికారులు సుజాత, ఇమాంబి, నజీర్, అనూషాలు ట్రైనర్లుగా వ్యవహరించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు ధర్మసింగ్ శాస్త్రి, భానుప్రకాష్, ఆసియాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం ఒక్కో బ్యాచ్‌కి మూడు రోజులు చొప్పున 6 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. ట్రైనర్స్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తించటం ద్వారా నయం చేయటానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. వివిధ భాగాలకు వచ్చే క్యాన్సర్ గురించి వివరించారు. ఆయా రకాల క్యాన్సర్లను ఎలా గుర్తించాలో వివరించారు. క్యాన్సర్‌ను ఎలా గుర్తించాలి? ఏ లక్షణాల ద్వారా తెలుసుకోవాలనే విషయాన్ని వైద్య సిబ్బందికి వివరంగా తెలియజేశామన్నారు. ముగింపు సందర్భంగా వైద్యులు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో సుమారు వెయ్యి మంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3.96 లక్షల విత్తనాలు, ఎరువులు అమ్మకాలు నిలుపుదల



పట్టణంలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేపడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

సత్తెనపల్లి: పట్టణంలోని పలు విత్తన దుకాణాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రూ.3.96లక్షల విలువైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల అమ్మకాలను నిలిపివేశారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడీఏ బి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ ఎస్ఐ రవికుమార్, సత్తెనపల్లి ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి, లైజనింగ్ ఆఫీసర్ ఏవో ప్రవీణ్ పట్టణంలోని పలు విత్తన, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన డీలర్ల వద్ద సరైన కంపెనీ సర్టిఫికెట్ లేనందున 4.78 కిలోల మిరప విత్తనాలు విలువ రూ.3,69,210, ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేని పురుగుమందులు 42.25 లీటర్లు విలువ రూ.19,650, ఫారం ఓ లేని ఎరువులు 22.5 లీటర్లు నానో యూరియా విలువ రూ.8,100 ఉన్నాయి. మొత్తం రూ.3,96,960 విలువ కలిగిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల అమ్మకాలు నిలుపుదల చేశారు. నాణ్యమైన విత్తనాలు రైతు సోదరులకు అందించాలనే ఉద్దేశంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. ఎవరైనా విత్తన, ఎరువులు, పురుగుమందుల డీలర్లు నాణ్యత లోపించిన వ్యవసాయ వనరులను రైతులకు అమ్మ చూపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైళ్లలో పోగొట్టుకున్న 12 సెల్‌ఫోన్‌ల అప్పగింత



ప్రయాణికులకు సెల్‌ఫోన్‌లు అందజేస్తున్న జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వరులు, ఎస్ఐలు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలోని రైళ్లలో ప్రయాణించినవారు పోగొట్టుకున్న 12 సెల్‌ఫోన్లను జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తిరిగి వారికి అప్పగించారు. జీఆర్పీ సీఐ తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ ఎస్ఆర్పీ పర్యవేక్షణలో విజయవాడ డీఎస్పీ బి.వి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గతంలో కొందరు ప్రయాణికులు సెల్‌ఫోన్‌లు పోయినవైనంపై ఫిర్యాదులు ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో సీఈఐఆర్ సైట్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో వారి వారి సెల్‌ఫోన్స్‌ను కనిపెట్టి 12 మందికి సెల్‌ఫోన్స్‌ను అప్పగించడం జరిగిందన్నారు. వాటి విలువ సుమారు రూ.3లక్షలకు పైగా ఉంటుందన్నారు. సెల్‌ఫోన్‌లను రికవరీ చేసిన రైల్వే పోలీసులకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

తొలి రోజు 343 పరుగులు చేసిన కర్నూలు జట్టు



సుమేథ్ భరద్వాజ్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహి స్తున్న అండర్–16 బాలుర అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో భాగంగా శనివారం శ్రీకాకుళం, కర్నూలు జిల్లాల జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న కర్నూలు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తన తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 343 పరుగులు చేసి పటిష్ట స్థితిలో ఉంది. కర్నూలు బ్యాట్స్‌మెన్ సుమేథ్ భరద్వాజ్ 225 బంతుల్లో 19ఫోర్లతో 140, పి.రోహిత్‌గౌడ్ 145బంతుల్లో 6ఫోర్లతో 68 పరుగులు సాధించారు. శ్రీకాకుళం బౌలర్లు కందుకూరి మనీష్ 4, సాయివెంకటప్రణీత్ 2వికెట్లు సాధించారు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.